క్లుప్తంగా

27న ఆర్ట్స్ కళాశాలలో మహా సూర్యయజ్ఞం

రాజమహేంద్రవరం సిటీ: రథసప్తమి సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో సుమారు 6 వేల మంది విద్యార్థులతో ఈ నెల 27వ తేదీ సాయంత్రం 3.30 గంటలకు మహా సూర్యయజ్ఞం నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో మహా సూర్యయజ్ఞం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దినేష్ కుమార్ మాట్లాడుతూ నగరంలోని మున్సిపల్ హైస్కూళ్లలో విద్యార్థులకు ప్రణవ సంకల్ప యోగాసమితి సహకారంతో మొదటి విడత ప్రాథమిక యోగా శిక్షణ ముగిసిందన్నారు. సూర్య నమస్కార విశిష్టతను తెలియజేస్తూ రథసప్తమిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ సాంబశివరావు, మెడికల్ ఆఫీసర్ వినూత్న, స్వచ్ఛ సంరక్షణ అధికారి అన్నమయ్య, ఈఈ శేషగిరిరావు, సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, యోగా గురువు పతంజలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

27న తిరుకల్యాణ బ్రహ్మోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటగిరి కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 9.45 గంటలకు లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివార్ల 23వ తిరుకల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కామిని వెంకటరామ ప్రసాద్ చౌదరి, ప్రధాన అర్చకుడు నండూరి శ్రీకృష్ణపరమాత్మ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థాన వార్షిక సత్కార పండితులు కాళ్లకూరి సూర్యశ్రీ (సూరిపండు) ఆధ్వర్యంలో సుంకర వెంకట నరసింహస్వామి, అరుణ దంపతులు ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపుపై హర్షం

సీటీఆర్ఐ: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని మరో పదేళ్లు కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంపై దళిత, గిరిజన సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు సోమవారం స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి విజయ కుమార్, ఎల్వీ ప్రసాద్, తాళ్లూరి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పొడిగించడంపై కృతజ్ఞతలు తెలిపారు. నక్కా సోమేశ్వరరావు, నిరీక్షణ జేమ్స్, పాము బాబూరావు, గారా త్రినాథ్, కె.అబ్బులు పాల్గొన్నారు.

రైతులకు తప్పని ఇబ్బందులు

రాజమహేంద్రవరం సిటీ: సకాలంలో ధాన్యం డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంగల శశిభూషణ్ ఆరోపించారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలు తెలుసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా పర్యటన చేస్తున్నామన్నారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిడమర్తి సత్యకుమార్, కార్యదర్శి నల్లా పవన్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ధవళేశ్వరం: ఇటీవల ధవళేశ్వరంలో బ్లేడ్ బ్యాచ్ దాడిలో హత్యకు గురైన అండిబోయిన రాజేష్ కుటుంబానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సోమవారం రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మత్స్యేటి ప్రసాద్, పండూరి అప్పారావు, పుక్కళ్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సత్వర స్పందన

రాజమహేంద్రవరం సిటీ: స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ప్రజల నుంచి 27 అర్జీలు వచ్చాయన్నారు. ప్రాధాన్యతా క్రమంలో వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీ విద్యార్థి ప్రతిభ

ప్రకాశం నగర్: గవర్నమెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో నిర్వహించిన క్రాస్ కంట్రీ పది కిలోమీటర్ల మెన్ అండ్ ఉమెన్ విభాగంలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలకు చెందిన బి.మోహనరావు ప్రథమ స్థానం నిలిచాడు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. దాదాపు వంద మందికి పైగా విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారన్నారు.

ప్రధాని మోదీ గద్దె దిగే వరకూ పోరాడదాం

ప్రకాశం నగర్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ పరిధిలోనే కొనసాగించాలని, లేకుంటే ప్రధాని మోదీ గద్దె దిగేవరకూ పోరాటం నిర్వహిస్తామని నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష జరిగింది. ఈ దీక్షకు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వైఎస్సార్ సీపీ నాయకులు టీకే విశ్వేశ్వర్ రెడ్డి, న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, టీడీపీ నాయకుడు గన్నికృష్ణ సీపీఎం జిల్లావర్గ సభ్యుడు ఎస్ఎస్ మూర్తి, ఆమ్‌ఆద్మీ అత్తిలి రాజు, కాంగ్రెస్ నాయకుడు బాలేపల్లి మురళీ, న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి కిరణ్ సంఘీభావం తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న బ్లేడ్ బ్యాచ్

- పెరుగుతున్న దాడులు
- ఆందోళనలో ప్రజలు

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు పెచ్చుమీరాయి. వారిలో చాలామందిని గంజాయి కేసుల్లో జైలుకు పంపడంతో కొన్ని నెలలు నేరాలు కట్టడిలో ఉన్నాయని ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో.. జైలుకు వెళ్లిన వీరంతా బెయిల్‌పై విడుదలై మళ్లీ దాడులకు దిగుతున్నారు. బ్లేడు సంస్కృతిని ప్రోత్సహిస్తూ నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్టు ప్రయోగించి జైలుకు పంపితేనే ప్రజలకు ప్రశాంతత ఇవ్వగలమనే నిశ్చయంతో పోలీసులు ఉన్నారు. తదనుగుణంగా కార్యాచరణకు సిద్ధమయ్యారు.

గంజాయి కేసుల్లో జైలుకు పంపినా..

గంజాయి మత్తులో బ్లేడ్లతో తిరుగుతూ నేరాలకు పాల్పడుతున్న యువకుల్లో చాలామందిపై ఇటీవల గంజాయి అక్రమ రవాణా కేసులు నమోదు చేసి వారిని జైలుకు పంపారు. ఈ తరుణంలో వీరిలో చాలామంది బెయిల్‌పై బయటకు వచ్చారు. మళ్లీ వారి ఆగడాలు మామూలయ్యాయి. గత నెల 8వ తేదీ తెల్లవారుజామున రాజానగరం పరిధిలోని మధురపూడి వద్ద కొందరు యువకులు బ్లేడ్లతో ఓ ద్విచక్ర వాహన చోదకుడిని బెదిరించారు. అలాగే



బ్లేడ్‌బ్యాచ్ దాడిలో గాయపడిన వ్యక్తి (ఫైల్)

కొంతమూరు గామన్ వంతెన వద్ద లారీ డ్రైవర్‌పై దాడి చేశారు. ఈ వరుస ఘటనలపై ఆ ప్రాంతవాసులు ఆందోళనకు గురయ్యారు. రాత్రి సమయంలో ఎయిర్ పోర్టు రోడ్డులో ఒంటరిగా ప్రయాణించేందుకు భయపడే పరిస్థితి నెలకొంది. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో తీవ్రంగా పరిగణిస్తూ పోలీసులను అప్రమత్తం చేశారు. ఆ ప్రాంతంలో గస్తీ ఎక్కువ ఏర్పాటు చేయడంతో కట్టడి జరిగింది. ఈ నెల 16వ తేదీన ధవళేశ్వరం కంచరపేటలో వెయ్యి రూపాయల కోసం ఓ యువకుడిని బ్లేడు బ్యాచ్ సభ్యుడు హత్య చేయడం సంచలనం రేకెత్తించింది. అదే రోజు రాత్రి 3వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధి లూథరగిరి ప్రాంతానికి చెందిన యువకుడిపై బ్లేడు బ్యాచ్ యువకులు విచక్షణా రహితంగా బ్లేడ్లతో దాడిచేసి వీపుపై గాట్లు పెట్టారు. వారం రోజుల ముందు బాధిత యువకుడికి సంబంధించిన బస్సు అద్దాలను బ్లేడు బ్యాచ్ యువకులు గంజాయి మత్తులో ధ్వంసం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత యువకుడిని బెదిరించే క్రమంలోనే బ్లేడుతో దాడి చేసినట్టు తెలుస్తోంది.

భయంతో ఫిర్యాదుకు నిరాకరణ

నేరాల బాట పట్టిన యువకులు బ్లేడ్లతో బెంబేలెత్తిస్తూ రాత్రి సమయాల్లో ఒంటరిగా వెళుతున్నవారిని బెదిరిస్తూ దోపిడీలు చేస్తున్నారు. ఈ నేరగాళ్లు తాము నివసిస్తున్న ప్రాంతాల్లోనే దుకాణదారులను బెదిరిస్తూ కొంత మొత్తాన్ని వసూలు చేసి గంజాయి కొనుగోలు చేస్తూ ఆ మత్తులో జోగుతుంటారు. వీరి ఆగడాలు స్థానికులకు తెలిసినా పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమ పేరు బయటకు చెబుతారన్న భయంతో పెదవి విప్పడం లేదు. బ్లేడుబ్యాచ్ యువకులపై ఎవరైనా ధైర్యం చేసి ఫిర్యాదు చేసినా వారికి కఠినమైన శిక్షలు ఏమీ ఉండకపోవడంతో వారం రోజుల వ్యవధిలోనే బయటకు వచ్చి కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. ఆ నేరగాళ్లతో మీకు ఎందుకయ్యా అన్న చందాన కొందరు పోలీసుల తీరు ఉంటోందన్న విమర్శలు ఉన్నాయి.

ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశాం



రాత్రి సమయంలో రైళ్లు, బస్సుల నుంచి దిగి ఇంటికి వెళుతున్న ప్రయాణికులు, ఒంటరిగా వెళుతున్న వారి రక్షణ కోసం రాజమహేంద్రవరం, ధవళేశ్వరం ప్రాంతాల్లో ప్రత్యేక టీములు ఏర్పాటు చేశాం. ఇందులో 24 మంది పోలీసులు పనిచేస్తున్నారు. వీరు రాత్రి గస్తీ కాస్తారు. ఎవరూ భయపడాల్సిన పనిలేదు. గతంలో బెదిరింపులు, దాడులకు పాల్పడిన బ్లేడ్ బ్యాచ్ యువకులు, పాత నేరస్తులు రాత్రి సమయంలో కనిపిస్తే, వారు నేరాలు చేయడానికి తిరుగుతున్నట్లుగానే భావించి జైలుకు పంపిస్తాం.

– ఎం.రజనీ, అడిషనల్ ఎస్పీ

ముగ్గురు బ్లేడ్‌బ్యాచ్ సభ్యుల అరెస్టు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బస్సుడ్రైవర్‌ను గాయపరిచిన కేసులో ముగ్గురు బ్లేడ్‌బ్యాచ్ సభ్యులను సోమవారం త్రీటౌన్ ఎస్సై టి.శ్యామ్ సుందర్ అరెస్టు చేశారు. వివరాలు.. లూథర్‌గిరి ఆర్‌అండ్‌బీ వాంబేకాలనీకి చెందిన కొయ్యా రాజశేఖర్ ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 8వ తేదీన ఇంటికి సమీపంలోని రోడ్డుపై బస్సును పార్కు చేయగా గుర్తుతెలియని వ్యక్తులు అద్దాలను పగలుగొట్టారు. ఈ విషయంపై శ్రీను అనే వ్యక్తిని ఆరా తీయగా అతడితో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో విధులు ముగించుకుని రాజశేఖర్ ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఆ సమయంలో ఆర్‌అండ్‌బీ వాంబేకాలనీకి చెందిన బోరింకల శ్రీనివాస్, రేకాడి చినపోసియ్య, మల్లాడి అంజిబాబు, మరో ఇద్దరు మైనర్లు అతడిని అడ్డగించి దాడి చేశారు. పదునైన ఆయుధంతో గాయపరిచారు. రాజశేఖర్ ఫిర్యాదు మేరకు ఎస్సై శ్యామ్ సుందర్ దర్యాప్తు చేపట్టారు. హైటెక్ బస్టాండ్ వద్ద తచ్చాడుతున్న శ్రీనివాస్, చిన పోసియ్య, అంజిబాబును సోమవారం అరెస్టు చేశారు.

2 నుంచి ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్



జెర్సీలను ఆవిష్కరిస్తున్న రౌతు సూర్యప్రకాశరావు తదితరులు

- ఆర్ట్స్ కళాశాలలో నిర్వహణ
- ట్రోఫీ, జెర్సీలను ఆవిష్కరించిన ప్రముఖులు

ప్రకాశం నగర్: మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ నాయకుడు అజ్జరపు వాసు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2 నుంచి రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఇంజినీర్ల అసోసియేషన్ హాల్లో చాంపియన్ ట్రోఫీతో పాటు క్రీడాకారులకు సంబంధించిన జెర్సీలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు రౌతు సూర్యప్రకాశరావు, వైద్యులు రౌతు పార్థసారథి, పారిశ్రామికవేత్త బీవీపీ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా శ్రీనగేష్, స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాజమహేంద్రవరం కేంద్రంగా ఆర్‌పీఎల్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. అజ్జరపు వాసు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుంచే శేఖర్ బాబు మాట్లాడుతూ దేశంలోని ఎనిమిది రాష్ట్రాలకు చెందిన 28 జట్లు ఈ టోర్నమెంటులో పాల్గొంటున్నాయని, 96 మ్యాచ్‌లు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో ప్రియదర్శిని డాక్టర్ ప్రసాద్, ఎస్ఎస్ మాల్ సింగ్, కన్నారావు పాల్గొన్నారు.

ఆదినారాయణ మృతికి సంతాపం

కడియం: నర్సరీ రంగ ప్రముఖుడు, కడియపులంకకు చెందిన రావిపాటి ఆదినారాయణ మృతికి పలువురు సంతాపం తెలిపారు. సోమవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కడియపులంక సొసైటీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు బోడపాటి సత్యనారాయణ, కురుమళ్ల ఆంజనేయులు, బోణం సత్యనారాయణ, నర్సరీ రైతులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.



ఆదినారాయణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలి

- ఎంపీ భరత్ రామ్
- ఉత్సాహంగా వాక్‌థాన్

రాజమహేంద్రవరం సిటీ: రహదారి భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి, ప్రమాదాలను నివారించాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ పిలుపు ఇచ్చారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు, విద్యార్థులు, ఆటో డ్రైవర్లతో సోమవారం నిర్వహించిన వాక్‌థాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కంబాలచెరువు హైటెక్ బస్టాండ్ నుంచి పుష్కరఘాట్ వరకూ ఈ వాక్‌థాన్ సాగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పరిమితికి మించిన వేగంతో నిర్లక్ష్యంగా వాహనం నడుపరాదన్నారు. మానవ తప్పిదాలతో జరిగే ప్రమాదాలే అత్యధికంగా ఉంటున్నాయన్నారు. జిల్లా రవాణా అధికారి కేఎస్ఎంవీ కృష్ణారావు మాట్లాడుతూ వాహనచోదకులందరూ రహదారి భద్రతకు సంబంధించిన నియమాలు కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, రవాణా శాఖ అధికారులు సీహెచ్ సంపత్ కుమార్, ఎస్ఎస్ రంగనాయకులు, జి.రామనారాయణ, సహాయ ఇంధన శకట తనిఖీ అధికారులు ఎన్.సబిత, కేసీహెచ్ సుమ పాల్గొన్నారు.



వాక్‌థాన్‌లో పాల్గొన్న ఎంపీ మార్గాని భరత్ రామ్

పేదల సంక్షేమానికి నిరంతర కృషి

- ఎంపీ భరత్ రామ్
- 23వ డివిజన్‌లో గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ: పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 23వ డివిజన్ హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలో గోదావరి గట్టు నుంచి సోమవారం గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీ వెలుగుబందలో కాంట్రాక్టర్ క్రాంతికుమార్ మోసంపై మహిళలు ఆవేదన వ్యక్తం చేయగా, వెంటనే త్రీటౌన్ సీఐకు ఫోన్ చేశారు. మార్చిలో సర్దుబాటు చేస్తానని క్రాంతికుమార్ రాతపూర్వక హామీ ఇచ్చాడని సీఐ వివరణ ఇవ్వడంతో సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలుంటే తనకుగానీ, డివిజన్ ఇన్‌చార్జికి గానీ తెలియజేయాలని స్థానికులకు తెలిపారు. పుత్ర వియోగంతో బాధపడుతున్న వ్యాపారి జయంతీలాల్ జీ సోలంకిని భరత్ రామ్ పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ కార్పొరేటర్, డివిజన్ ఇన్‌చార్జి వాకచర్ల కృష్ణ, గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్మన్ సంకిన భవానీ ప్రియ, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, ఇన్నమూరి ప్రదీప్ కుమార్, పోలు విజయలక్ష్మి పాల్గొన్నారు.



గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమంలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ భరత్ రామ్

రాజేష్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- రూ.10 లక్షల ఆర్థిక సాయానికి కృషి
- సొంత ఇల్లు సమకూర్చుతాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ధవళేశ్వరం: ఇటీవల ధవళేశ్వరంలో హత్యకు గురైన అండిబోయిన రాజేష్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌తో కలిసి జక్కంపూడి రాజా సోమవారం మృతుడు రాజేష్ తల్లిని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ జరిగిన ఘటన చాలా దురదృష్టకరమన్నారు. ఏడాది క్రితమే తండ్రి కన్నుమూయడంతో రాజేష్ రెక్కల కష్టంపైనే ఆ కుటుంబం ఆధారపడి ఉందన్నారు. ప్రస్తుతం రాజేష్ కూడా చనిపోవడంతో పరిస్థితి హృదయవిదారకంగా మారిందన్నారు. రాజేష్ కుటుంబానికి ప్రభుత్వ పరంగా రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించడానికి రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. ఆ కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చుతామన్నారు. రాజేష్ హత్యకు కారకులైన నిందితులపై కఠిన చర్యలు తీసుకునేలా పోలీస్ శాఖ ద్వారా కృషి చేస్తామని జక్కంపూడి రాజా తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోడి ప్రవీణ్, వాసంశెట్టి గంగాధర్, మాజీ సర్పంచ్ పిన్నింటి ఏకబాబు, మాజీ వార్డ్ సభ్యుడు చాటకాల చంటి, నాయకులు తలారి వరప్రసాద్, షట్టర్ బాషా, సాధనాల చంద్రశేఖర్(శివ), బోడపాటి కుమార్, పెన్నాడ జయప్రసాద్, దేవులపల్లి సరితారాణి, పుట్టా పరేశనాథ్, గోలి దేవకుమార్, గునిపె అశోక్, శ్రీరంగం బాలరాజు, బర్రి కామేశ్వరరావు పాల్గొన్నారు.



రాజేష్ తల్లిని ఓదార్చుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, చిత్రంలో కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

సంక్షేమానికి చిరునామా సీఎం జగన్

- ఎంపీ భరత్ రామ్
- ఉత్సాహంగా గడప గడపకూ..

రాజమహేంద్రవరం సిటీ: దేశంలో ఎక్కడా లేని విధంగా నవరత్నాలతో పాటు అర్హులైన పేదలకు అన్ని పథకాలూ అందిస్తూ సంక్షేమానికి చిరునామాగా సీఎం జగన్ నిలిచారని ఎంపీ మార్గాని భరత్ రామ్ కొనియాడారు. స్థానిక 46వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిమేడబోయిన సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో ఉల్లాసంగా కొనసాగిన ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్ రామ్‌కు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును, స్థానిక ఇబ్బందులను ఎంపీ తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. లేనిపక్షంలో డివిజన్ ఇన్‌చార్జికి తెలియజేయాలన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి జగన్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. పేదలకు అందించే ఇళ్ల స్థలాలపై టీడీపీ వేసిన కేసులు కోర్టులో వీగిపోయాయన్నారు. త్వరలోనే అర్హులైన వారందరి సొంతింటి కల నెరవేర్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, పార్టీ నాయకులు పెంద్ర వీరన్న పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ సేవలు చిరస్మరణీయం

రాజమహేంద్రవరం సిటీ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి కొనియాడారు. నేతాజీ జయంతి సందర్భంగా సోమవారం శ్రీకృష్ణసాయి కల్యాణ మండపంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. సమితి జనరల్ సెక్రటరీ కానుబోయిన సాగర్ మాట్లాడుతూ స్వచ్ఛ గోదావరి సాధించే వరకూ నేతాజీ స్ఫూర్తితో పోరాటం సాగిస్తామన్నారు. ఉపాధ్యక్షుడు బర్రే కొండబాబు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

- అన్నపూర్ణమ్మపేటలో నేతాజీ విగ్రహానికి వైఎస్సార్ సీపీ బీసీసెల్ చైర్మన్ మజ్జి అప్పారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్, మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం పాల్గొన్నారు.
- దేశానికి స్వాతంత్ర సముపార్జనలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర కీలకమైందని పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ లంక సత్యనారాయణ అన్నారు. అన్నపూర్ణమ్మపేటలోని నేతాజీ విగ్రహానికి ఆయన పుష్పాంజలి ఘటించారు.

సేవలు స్ఫూర్తిదాయకం



సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు

కడియం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు స్ఫూర్తిదాయకమని మండల విద్యాశాఖాధికారి వి.లజపతిరాయ్ అన్నారు. మండలంలోని వేమగిరితోట ఎంపీపీ స్కూల్లో హెచ్ఎం కె.జయరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బోస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- మురమండలోని బస్టాండ్ వద్ద ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి స్థానికులు పుష్పాంజలి ఘటించారు.

కేంద్రీయ విద్యాలయలో చిత్రలేఖనం పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో సోమవారం కేంద్ర విద్యామంత్రిత్వశాఖ విద్యార్థుల సృజనాత్మక వ్యక్తీకరణలను ప్రోత్సహించడానికి పరీక్షపేచర్చ అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పరాక్రమ్ దివస్ జరిపారు. అనంతరం చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. జిల్లాలోని స్టేట్ బోర్డు, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటారు. జె.సత్యదేవి (ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్), పి.కార్తిక్(మున్సిపల్ హైస్కూల్, గాంధీపురం3), వి.పావని తేజశ్రీ (లాలాచెరువు మున్సిపల్ హైస్కూల్), ఎన్.తన్విత లక్ష్మి (లారెల్ హైగ్లోబల్ స్కూల్), సూజ్యత జోలే (కేంద్రీయ విద్యాలయ, ఓఎన్‌జీసీ)లు విజేతలుగా నిలిచారు. వారికి పుస్తకాలు, సర్టిఫికెట్లు అందించారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.కృష్ణ సిన్హా, డ్రాయింగ్ టీచర్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య కేసులో ప్రేమికుడి అరెస్టు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్యకు కారకుడైన ప్రేమికుడు పట్టా శ్రీను ఎలియాస్ జయను సోమవారం త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గండేపల్లి మండలం మురారికి చెందిన ఓ యువకుడు ఆపరేషన్ చేయించుకుని ట్రాన్స్‌జెండర్‌గా మారాడు. ప్రణీతగా పేరుమార్చుకుని ఆరేళ్ల క్రితం నుంచి సింహాచలనగర్‌లో ఉంటున్నాడు. నాలుగేళ్లుగా సింహాచలనగర్‌కు చెందిన తాపీమేస్త్రీ పట్టా శ్రీను (జయ), ట్రాన్స్‌జెండర్ ప్రణీత ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి నాలుగేళ్లుగా శ్రీను ఆర్థిక అవసరాలు తీర్చుకుంటున్నాడు. ప్రణీత పెళ్లిచేసుకోవాలని అడగ్గా ముఖం చాటేశాడు. అలాగే ఇటీవల మరో ట్రాన్స్‌జెండర్‌తో ప్రేమలో పడి ప్రణీతకు దూరంగా ఉంటున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ప్రణీత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన త్రీటౌన్ ఎస్సై ఎస్‌వీ రామారావు, సిబ్బందితో కలిసి సోమవారం సింహాచలనగర్‌లో పట్టా శ్రీనును అరెస్టు చేశారు. రిమాండ్ కోసం కోర్టులో హాజరుపర్చనున్నట్టు తెలిపారు.

కల్యాణోత్సవ ఏర్పాట్లు ప్రారంభం



రథాన్ని బయటకు తీస్తున్న భక్తులు

ధవళేశ్వరం: గ్రామంలోని ధవళగిరిపై కొలువైన శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీజనార్దన స్వామివారి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సోమవారం జనార్దన స్వామి వారి రథాన్ని రథశాల నుంచి బయటకు తీశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఫిబ్రవరి 1వ తేదీ భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

నూతన కార్యవర్గం ఎన్నిక

ధవళేశ్వరం: ధవళేశ్వరం మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గ్రంధి వెంకటరామ జగన్నాథం, కార్యదర్శిగా బొడ్డేటి శివరామకృష్ణ(శివాజీ), కోశాధికారిగా మండ నరేష్ ఎన్నికయ్యారు.

నర్సరీ సందర్శన

కడియం: కడియపులంకలోని ధనలక్ష్మి నర్సరీతో పాటు పలు నర్సరీలను బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి సోమవారం సందర్శించారు. నిడమర్తి సత్యకుమార్, బొరుసు సుబ్రహ్మణ్యం, కొటికలపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.